# నగ్నసాక్షి

అలపర్తి రామకృష్ణ

**అనసూయ** స్నానం చేస్తూ తలుపు దగ్గర ఎవరో నిలబడినట్లనిపించి ఉలిక్కిపడింది.

పెళ్ళయిన కొత్తలో శేఖరం ఇలాగే స్నానం చేస్తున్నప్పుడు తలుపు దగ్గర నిలబడి అల్లరి చేస్తుండేవాడు. కాని, ఆయన కాదు. ఆయన కిప్పుడు ఆఫీసు టైము.

లేచి నిలబడి టవల్ చుట్టుకుందా మంటే భయమేసింది. నిలబడితే తను స్పష్టంగా తలుపు దగ్గర నిలబడ్డ వాళ్ళకు కన్పిస్తుంది. రేకుల తలుపు పైభాగాన అంత పెద్ద చిల్లు లున్నాయి.

ఎవరిదో నీడ స్పష్టంగా తలుపు కింద భాగాన గచ్చుమీద దగ్గరవుతుంటే గాభరాగా "ఎవరదీ?" అని కేక వేసింది అనసూయ.

నీడ పరుగెత్తింది తలుపుకి దూరంగా.

నిన్న సరిగ్గా ఇదే సంఘటన.

ముందు గదిలో రవి చదువుకుంటున్నాడు. పెరట్లోకి ఎవరొచ్చి ఉంటారు?

అనసూయ లేచి గబ గబా టవల్ ఒంటికి చుట్టుకుని, తలుపు గడి తీసి తల వోరగా బయటకు పెట్టి చూసింది.

వంటింట్లోకి పరుగెత్తి తలుపు దగ్గర కేస్తున్న రవి కన్పించగానే ఆమె గుండె దడ తగ్గింది.

మళ్ళీ తలుపేసుకుని తీరిగ్గా స్నానం చేయ సాగింది.

బాత్‌రూమ్ దగ్గరకు రవి ఎందుకొచ్చేడు?

తనని నగ్నంగా చూడాలనిపించిందా?

ఇంత చిన్న వయస్సులో అదేం కోరిక!

"ఎడాల్సెంట్" ప్రాబ్లమ్.

తను ఎమ్. ఎ లో చదివిన సైకాలజీ ఈ సమస్యను పరిష్కరిస్తుందా?

స్త్రీని నగ్నంగా చూడాలనే తపన వాడిలో మొదలైంది. చిన్నపిల్లాడని పట్టించుకోకుండా ఉంటే వాడి కోరిక వెర్రి తలలు వేస్తుంది.

చిన్నప్పటి నుంచి పెంచిన వదినను నగ్నంగా చూడాలనే కోరిక వాడి మనస్సులో ఎలా దూరింది?

పిచ్చి ప్రశ్న.

తప్పు వాడిది కాదు. సినిమాలు, వాల్‌పోస్టర్లు, సెక్సు పుస్తకాలు వాడి మనఃస్థితిని ఆ స్థితికి తీసుకువచ్చాయి.

పన్నెండేళ్ళ వాడి బుర్రలోని ఆ వికారమైన కోరికను తొలగించాలి.

ఎలా? ఎలా?

ఆయనతో చెబితే —

అమ్మో! చావ బాదేస్తారు.

"నగ్నంగా వదినను చూడా లనుకోవడం తప్పమ్మా! వదిన తల్లిలాంటిదని" నచ్చ జెప్పితే ...

లాభం లేదు. ఎదురు తిరుగుతుంది వాడి మనస్సు.

ఎందుకు చూడకూడదు?

చూస్తే తప్పేమిటి?

ఈ ప్రశ్నలు వాడి బుర్రని తొలిచేస్తాయి. సహజంగానే వాడి మనస్సులోని కోరిక సమసి

అనసూయ స్నానం ముగించి ఇంట్లోకి వెళ్ళింది.

తల దువ్వుకుంటూ, ముందు గదిలో పుస్తకం ముందేసుకుని దొంగతనంగా తనవైపే చూస్తున్న రవిని చూసింది.

రవి చూపులు పచ్చగా మెరుస్తున్న అనసూయ నడుంపై, పొట్ట మడతల్ని గుచ్చి గుచ్చి చూస్తున్నాయి.

ఆమె రవి దగ్గర కొచ్చి నిలబడగానే తల వంచుకుని గబగబా చదవడం మొదలెట్టాడు.

ఆ క్షణంలో ఆమె కేదో ఆలోచన స్ఫురించింది.

ఆమె మనస్సు తేలికపడింది.

పిల్లల్ని చూడనివ్వకుండా పెట్టెలో ఏవో వస్తువులు పెట్టి తాళం వేస్తే, ఆ పెట్టెలో ఏముందో చూడాలనే పట్టుదల వాళ్ళలో ఏర్పడుతుంది. అవకాశం దొరికినప్పుడు తాళం తీసి ఆ పెట్టెలో ఏముందో చూడాలనే తపన వాళ్ళలో ఏర్పడుతుంది. తాళం వెయ్యకపోతే పెట్టె జోలికే పోరు. వాళ్ళ కళ్ళముందే పెట్టెలో సామాను పెట్టి, వాటిని మనం జాగ్రత్త పరుచుకోవాలని నచ్చజెబితే వాటికి కాపలాదార్లలా మారతారు పిల్లలు.

పిల్లల మనస్సులో సమాజం మంచి విత్తనాలు నాటితే చక్కని మొక్కలై పుష్పిస్తాయి. ఫలిస్తాయి. లేకపోతే బొమ్మజెముళ్ళ లాంటి మొక్కలు మొలకెత్తే ప్రమాదం లేకపోలేదు.

ఆడపిల్లల జోలికి పోవద్దని ఆంక్షలు పెడితే, వాళ్ళని "టీజ్" చెయ్యాలని, ఏడిపించాలనిపిస్తుంది. మొదట్నించి ఆడ, మగ తేడా లేకుండా ఫ్రీగా తిరగనిస్తే వాళ్ళ మధ్య అడ్డు తెరలు తొలగిపోయి సమభావం ఏర్పడుతుంది.


"వదినా! స్కూలుకు టైమవు తున్నది. నేను వెళ్తున్నా!" పుస్తకాలు సంచీలో కుక్కుకుని ఇంట్లో నుంచి బయటపడ్డాడు రవి.

గబగబా నడిచి వెళ్తున్న రవిని చూస్తుంటే, వచ్చీరాని నడకతో చిన్నప్పుడు తన కళ్ళముందు తిరిగిన రెండేళ్ళ రవి గుర్తుకు వచ్చాడు.

తను కాపురానికి వచ్చిన కొత్తలో అత్తయ్య ఒడిలోని చిన్నపిల్లాడిని చూసి ఆశ్చర్యపోయింది— ఆడబిడ్డ కొడుకేమో ననుకుంది.

బుల్లి మరిదని తెలిసి ఆశ్చర్య పోయింది.

మొదటిసారిగా ఇంటి కొచ్చిన వాళ్ళు రవిని చూసి "మీ మనవడా?" అన్నప్పుడు సగం సిగ్గుతో చచ్చిపోయేది అత్తయ్య. ముప్పై ఎనిమిదేళ్ళ వయస్సులో తనకు కొడుకు పుట్టడ మేమిటని మధన పడేది. అదేమంత పెద్ద సమస్య కాదని, పిల్లల్ని



కనడం విచిత్రమేమీ కాదని చెప్పినా వినేది కాదు. ఎప్పుడూ బాధపడుతూ ఉండేది.

ఆ దిగులుతోనే మంచం పట్టి, రవి రెండో పుట్టిన రోజు పండుగ చెయకుండానే చనిపోయింది ఆమె. మామయ్య ఇల్లు వాకిలి పట్టించుకోకుండా తిరగటం మొదలు పెట్టేడు.

రవి పెంపకం తన చేతుల్లో పడింది. తనకి పిల్లల్లేక పోవడంతో సొంత కొడుకులాగానే పెరిగేడు రవి.

వాడికి పదేళ్ళు వచ్చినా తన కళ్ళలో రెండేళ్ళ రవి మెదులుతూనే ఉన్నాడు. ఆ పిచ్చి వెధవ తనని నగ్నంగా చూడాలనుకుంటున్నాడు. అలనాటి అన నూయని త్రిమూర్తులు నగ్నంగా వడ్డించమంటే, ఆమెకూడా తనలాగే మధనపడిందేమో!

● ● ● ●

భోంచేసి పుస్తకం ముందేసుకుని కొరుకుడుపడని పదిహేడో ఎక్కంతో కుస్తీ పడుతున్నాడు రవి.

నవల చదువుతూ ఆ గదిలోనే కూర్చుండి పోయింది అనసూయ.

"స్నానానికి వెళ్ళవేం, వదినా?"

రవి ప్రశ్నతో ఉలిక్కిపడింది అనసూయ.

మెదడు పొరుగులో మడతలు పడి ఉన్న సమస్య మళ్ళీ నిటారుగా నిలబడింది.

ఒక్క క్షణం ఒళ్ళు జలదరించింది.

తప్పదు. ఈ సమస్యని ధైర్యంగా ఎదుర్కోవాలి. లేచి నిలబడుతుంటే కాళ్ళు వణికేయి.

తను చేయబోతున్న పని మంచి పరిష్కారమేనా? ఇదో ప్రయోగం.

"కుళాయిలో నీళ్ళు సరిగ్గా రావడం లేదురా! స్నానం చేయడం లేదు. బట్టలు మార్చుకుంటా!"

అనసూయ బట్టల స్టాండు దగ్గర కెళుతూ రవి మొహంలోని అసంతృప్తిని గమనించకపోలేదు.

ఆమె చెయ్యి చీర ముడిపై పడింది.

రవి తల పైకెత్తాడు.

ఎదురుగా రోజుకలర్ లంగాలో పరిపుష్టిగా మెదులుతున్న ఆమె తొడలపై రవి చూపులు నిలి చేయి.

మరో క్షణంలో అలా చూడటం తప్పనిపించి తల వంచుకున్నాడు.

మళ్ళీ తలెత్తి చూసేసరికి ఎటువంటి ఆచ్ఛాదన లేకుండా ఆమె వక్షోజాలు పచ్చగా మెరుస్తూ కన్పించేయి.

వాడి కళ్ళు బైర్లు కమ్మాయి.

ఆమె చేతివేళ్ళు లంగా ముడిపై కదులుతుంటే, రవి లేచి నిలబడ్డాడు.

"వదినా, నేను క్రాంతి వాళ్ళింటికి వెళుతున్నా! సైన్సు నోట్సు తెచ్చుకోవాలి." తలెత్తకుండానే గబగబా అనేసి బయటకు పరుగెత్తాడు.

అనసూయ కళ్ళు విజయగర్వంతో మెరిశాయి.

● ● ●

చన్నీళ్ళ స్నానం చేస్తూ స్కూల్లో జరుగుతున్న ఆటల పోటీల గూర్చి ఆలోచిస్తున్నాడు రవి.

తలుపు దగ్గర ఎవరో మెదిలినట్లనిపించింది.

గాజుల గలగల విన్పించింది.

నిలబడి స్నానం చేస్తున్నవాడల్లా కూర్చుండి పోయేడు.

"బాత్‌రూమ్‌లో సబ్బు ఉందట్రా?" సబ్బు అక్కడ ఉందనితెలిసే నవ్వుతూ అడిగింది అనసూయ.

"ఉందిగాని, నువ్వెళ్ళు" అన్నాడు రవి సిగ్గు పడుతూ.

అనసూయ నవ్వుకుంటూ అక్కడ నుంచి వెళ్ళి పోయింది.

ఆ రోజు సాయంత్రమే ఎక్కడ నుంచో రేకు ముక్క తెచ్చి, చిల్లులు కనబడకుండా బాత్‌రూమ్ తలుపుకి అమర్చేడు రవి.

★

